క్లుప్తంగా

బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజుగౌడ్



తాండూరు రూరల్: బీఆర్ఎస్ బీసీ సెల్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన కలాల్ రాజుగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్య క్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉమాశంకర్, నాయకులు రాంలింగారెడ్డి, నరేందర్‌రెడ్డి, రాజప్పగౌడ్, వడ్డె మదన్‌మోహన్, వెంకట్రామ్‌లు పాల్గొన్నారు.

తాండూరు డిపో తొలి మహిళా కండక్టర్ మృతి



రేణుక(ఫైల్)

తాండూరు టౌన్: తాండూరు డిపో తొలి మహిళా కండక్టర్ గుండెపోటుతో మృతి చెందింది. పట్టణంలోని టీఎస్ ఆర్టీసీలో కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రుద్ర రేణుక (52) బుధవారం రాత్రి ఛాతిలో నొప్పిగా ఉందని, ఇంట్లో కుర్చీలో కుప్పకూలిపోయింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా ఆమె అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తాండూరు డిపోలో 1996లో విధుల్లో చేరిన ఆమె తొలి మహిళా కండక్టర్‌గా రికార్డు కెక్కింది. ఆమె మృతికి డిపో మేనేజర్ సమత, సహోద్యోగులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

బహుజన ముక్తి అభ్యర్థిగా సూర్యానాయక్



బొంరాస్‌పేట: బహుజన ముక్తి పార్టీ (బీఎంపీ) కొడంగల్ నియోజకవర్గ అభ్యర్థిగా రాథోడ్ సూర్యానాయక్ పోటీలో నిలువనున్నారు. మండల పరిధిలోని మేడిచెట్టుతండాకు చెందిన రాథోడ్ సూర్యానాయక్ డిగ్రీ వరకు చదువుకొని ప్రజా సమస్యలు, ప్రజాఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటున్నాడు. బీఎంపీ నుంచి ఎన్నికల్లో పాల్గొనేందుకు ముందుకు వచ్చాడు. ఈమేరకు 16 అంశాలతో కూడిన తమ పార్టీ మేనిఫెస్టోను ప్రకటించాడు. బహుజనులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓబీసీల రాజ్యాధికారం కోసం తమ పార్టీ ఆవిర్భవించిందన్నారు. మంచం గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు.

సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయి

- పార్టీ మండల ఉపాధ్యక్షుడు అశోక్

మర్పల్లి: పేద ప్రజల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలే వికారాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్‌ను మరో మారు గెలిపిస్తాయని పార్టీ మండల ఉపాధ్యక్షుడు పట్లూర్ అశోక్ అన్నారు. గురువారం పట్లూర్ గ్రామంలో సర్పంచ్ ఇందిర, పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. ప్రతీ ఒక్కరు కారు గుర్తుకు ఓటు వేసి ఆనంద్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మశ్చందర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అంజయ్య, ఉప సర్పంచ్ మోహీజ్, మైనార్టీ సెల్ బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు షఫీ, సీనియర్ నాయకులు మోహన్‌రెడ్డి, ప్రభాకర్, శంకర్, నా రాయణ, పాండు, మల్లయ్య స్వామి, వార్డు మెంబర్లు బాలేశ్, సునీల్, అంజాద్, ఖాజా, అడివిరెడ్డి, అరుణ్, శ్రీహరి, వికాస్ తదితరులున్నారు.

ప్రచారంలో ఎమ్మెల్యే సతీమణి




బతుకమ్మ ఆడుతున్న సబితాఆనంద్

అనంతగిరి: వికారాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సతీమణి డాక్టర్ సబితాఆనంద్ గురువారం ప్రచారంలో పాల్గొన్నారు. పట్టణంలోని వార్డుల్లో బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కారు గుర్తుకు ఓటేసి ఆనంద్‌కు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఆమె వెంట పలువురు కౌన్సిలర్లు ఉన్నారు.

నీటికుంటలో జారిపడి.. మహిళ మృతి

తలకొండపల్లి: దుస్తులు ఉతుకుతూ ప్రమాదవశాత్తు కాలుజారి నీటికుంటలో (ఫాంపాండ్) పడి ఓ మహిళ మృతి చెందింది. ఎస్‌ఐ శ్రీను తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని పూల్‌సింగ్‌తండాకు చెందిన పాత్లావత్ జ్యోతి (30).. గురువారం వ్యవసాయ పొలంలో ఉన్న ఫాంపాండ్ వద్ద దుస్తులు ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటికుంటలో పడింది. దీంతో ఊపిరాడక మృతిచెందింది. మృతురాలి భర్త శంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు



అనంతగిరి: స్కందమాత అవతారంలో వైభవలక్ష్మి



కొడంగల్ రూరల్: దుర్గామాత పూజలో ఎస్ఎస్‌కే సమాజ్ సభ్యులు



ధారూరు: కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలు, ఆలయాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. భక్తులు ప్రత్యేక పూజలు మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేస్తూ భక్తి చాటుకున్నారు. పలు మండపాల వద్ద అన్నదానం చేశారు. – వికారాబాద్ నెట్‌వర్క్



కొడంగల్ రూరల్: సామూహిక కుంకుమార్చనలో మహిళలు



కుల్కచర్ల: అన్నదానం చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

బెల్టుషాపులపై పోలీసుల దాడి



మద్యం సీసాలతో ఇస్లావత్ బాలు

అబ్దుల్లాపూర్‌మెట్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలిచారు. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ జేఎన్ఎయూఆర్ఎం కాలనీలోని బ్లాక్‌నెం.11/8లోని ఓ కిరాణా దుకాణంలో అధిక ధరకు మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దుకాణంపై దాడి చేయగా రూ.11వేల విలువ చేసే మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. నిర్వాహకుడు ఇస్తావత్ బాలును అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

రైతులకు కరెంట్ ‘షాక్’

- విద్యుత్ సరఫరాలో అంతరాయం
- ఎండిపోతున్న పంటలు
- ఆవేదన చెందుతున్న అన్నదాతలు

కరెంటు కష్టాలు రైతులను తిప్పలు పెడుతున్నాయి. ఇరవైనాలుగు గంటల విద్యుత్ సరఫరా అని చెబుతున్నా ఆచరణకరువైంది. ‘అబ్ కీ బార్.. కిసాన్ సర్కార్’ నినాదం ఎత్తుకున్న ప్రభుత్వం కరెంటు కోతలు విధించడంతో రైతుల విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోంది.



స్పింక్లర్లతో పంటను తడుతున్న రైతు

దౌల్తాబాద్: వర్షాకాలంలో సకాలంలో వర్షాలు కురవక రైతులు కేవలం బోరుబావుల మీదనే ఆధారపడి సాగు చేశారు. ఈ ఏడాది మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు వేల సంఖ్యలో బోరుబావులు తవ్వకున్నారు. బోర్లలో వచ్చిన నీటిని సద్వినియోగం చేసుకునేందుకు విద్యుత్ మోటార్లను అమర్చుకున్నారు. ఇప్పుడు కరెంట్ కోతలు ఎక్కువ కావడంతో పంటలకు తగినన్ని నీళ్ల పారించలేక పోతున్నారు. దీంతో పంటలు ఎండుముఖం పట్టాయి.

ఆచరణకు దూరంగా 24గంటల సరఫరా

మండల పరిధిలో 33 గ్రామాలకుగాను నాలుగు సబ్‌స్టేషన్ల నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అయితే 24గంటల త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతున్నా ఆచరణలో లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం అధికలోడ్‌తో తరచూ కరెంట్ కోతలు విధిస్తున్నారు. రాత్రి 12గంటలు దాటిన తర్వాత ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని దుస్థితి నెలకొందని వాపోతున్నారు. రాత్రి 12గంటల నుంచి ఉదయం 6గంటల వరకు తిరిగి ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మాత్రమే విద్యుత్ సరఫరా ఉంటుందంటున్నారు. రోజు సుమారు 6 గంటల నుంచి 8గంటల వరకు కోతలు విధిస్తున్నారంటున్నారు.

40శాతం బోరుబావుల కిందే సాగు

ఈ ఏడాది వానాకాలంలో సుమారు 12వేల ఎకరాల్లో రైతులు పంట సాగు చేశారు. 40శాతం బోరుబావుల కిందనే సాగుచేసినవే ఉన్నాయి. వాటిలో ఎక్కువ వరి, పత్తి, కూరగయాలు సాగు చేశారు. పెరుగుతున్న కరెంట్ కోతలతో నీటిని పారించలేక పోతున్నామంటున్నారు. పంట పొలాలకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని కోరుతున్నారు.

తేమ ఆవిరైతుంది



రోజు రోజుకు ఎండలు ముదురుతున్నాయి. పంటపొలాల్లో తేమ ఆవిరైపోయింది. దీంతో సాగునీరు ఎక్కువగా అవసరం. కరెంట్ కోతలతో పంటలకు నీరందడంలేదు. అధికారులు స్పందించి విద్యుత్ కోతలు లేకుండా చేయాలి.

– నర్సింలు, రైతు, దౌల్తాబాద్

ప్రణాళిక ప్రకారం సరఫరా

విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేందుకు ప్రణాళిక ప్రకారం విద్యుత్ సరఫరా చేస్తున్నాం. లైన్‌మెన్‌లు ఎల్‌సీ తీసుకున్నప్పుడు అంతరాయం కలుగుతుంది. కొన్ని సాంకేతిక కారణాల వల్ల విద్యుత్ సౌకర్యానికి అంతరాయం కలిగినా ఎప్పటికప్పుడు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం.

– మహిపాల్, ఏఈ, దౌల్తాబాద్

కేంద్ర పథకాలతో పేదలకు మేలు

- బీజేపీ జిల్లా నాయకుడు బలరాంగౌడ్



సిరిపురంలో బీజేపీ నాయకుల ఎన్నికల ప్రచారం

మర్పల్లి: కేంద్ర ప్రభుత్వ పథకాలతో పేదలకు మేలు చేకూరుతుందని బీజేపీ జిల్లా నాయకుడు బలరాంగౌడ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని సిరిపురం, కొత్లాపూర్, మర్పల్లి, తుమ్మలపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాంగౌడ్ మాట్లాడుతూ.. వికారాబాద్ నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా పలువురు దరఖాస్తు చేసుకున్నారని 15 ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్న ఎస్సీ సెల్ జిల్లా ఇన్‌చార్జి నవీన్‌కుమార్‌కే అధిష్టానం టికెట్ ఖరారు చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు కమలం గుర్తుకు ఓటేసి డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా ఇన్‌చార్జి నవీన్‌కుమార్ మండల నాయకులు నాగేశ్ బూత్ స్థాయి నాయకులు అమర్‌నాథ్, నరేశ్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలి



తిరుపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

- కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి

కొడంగల్: మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు గురువారం హస్తం గూటికి చేరారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో వారికి కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ నియోజకవర్గ అభ్యర్థి రేవంత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఇచ్చిన హామీలను నెరవేర్చని బీఆర్‌ఎస్‌కు తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచిన ఆరు అంశాలను వివరిస్తూ క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషిచేయాలని అన్నారు. నిరుద్యోగ యువత నిరాశతో కొట్టుమిట్టాడుతూ బీఆర్‌ఎస్‌కు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఆధ్యాత్మికతపై అవగాహన అవసరం



ఆధ్యాత్మిక అంశాలను బోధిస్తున్న భాస్కరయోగి

పరిగి: భవిష్యత్ తరాలకు మన సంస్కృతి, సాంప్రదాయాలను అందించాల్సిన అవసరం ఉందని ప్రముఖ వక్త భాస్కరయోగి అన్నారు. గురువారం పరిగి నియోజకవర్గ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డు కాలనీ పరిధిలో కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని ఆధ్యాత్మికతత్వం, ఆచార వ్యవహారాలు, మన సాంప్రదాయాలు వంటి విషయాలపై భక్తులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాఘవేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ 'గ్యారెంటీ'లు

దౌల్తాబాద్: కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలోని ఆరు గ్యారెంటీ పథకాలను ప్రతీ గడపకు తీసుకెళ్తామని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గోకఫసల్‌వాద్, నందారం, తిమ్మారెడ్డిపల్లి. దౌల్తాబాద్, బిచ్చాల గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను గడప గడపకూ తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వంద రోజుల్లో అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సప్ప, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, శకీల్, భీంరెడ్డి తదితరులున్నారు.



దౌల్తాబాద్: ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బీఆర్‌ఎస్‌కే ప్రజల ఆశీర్వాదం



మాడ్గుల: బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

- కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

మాడ్గుల: రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కే ప్రజల ఆశీర్వాదం ఉందని, రాష్ట్రంలో మూడవసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. రాష్ట్రంలో విపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలకు ప్రజల మద్దతు లేదన్నారు. గురువారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏమిరెడ్డి జైపాల్‌రెడ్డి అధ్యక్షతన మండల కేంద్రంలో ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించారు. సభకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సభలో జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాయని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ప్రజల సంక్షేమం కోసం అనేక వినూత్న పథకాలు అమలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. సీఎం కేసీఆర్ మరోసారి ప్రజల కోసం అద్భుతమైన మేనిఫెస్టోను ప్రకటించారని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీకి ఒక్కసీటు కూడా రాదని విమర్శించారు. కల్వకుర్తిలో కలిసికట్టుగా మరోసారి బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేద్దామన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ శంకర్‌నాయక్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు జంగయ్యగౌడ్, మార్కెట్ డైరెక్టర్లు నిరంజన్, సుభాష్, మాజీ ఎంపీపీ జైపాల్‌నాయక్, సర్పంచులు యాదిరెడ్డి, యాదయ్య, జంగయ్య, ఎంపీటీసీ సభ్యులు బ్రహ్మం, నాయకులు లాలయ్యగౌడ్, వెంకటేశ్వర్లు, రాజవర్ధన్‌రెడ్డి, దర్మారెడ్డి, రమేశ్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

‘నాలుగోసారి జైపాల్‌యాదవ్‌నే గెలిపిద్దాం’

తలకొండపల్లి: నియోజకవర్గ ఎమ్మెల్యేగా నాలుగోసారి జైపాల్‌యాదవ్‌నే గెలిపించి గులాబీ జెండా ఎగురవేస్తామని మిషన్ భగీరథ కార్పొరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్‌గుప్తా అన్నారు. గురువారం మండల పరిధిలోని చీపునుంతల, తుమ్మలకుంటతండాల్లో ఆయన పర్యటించి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్‌గుప్తా మాట్లాడుతూ.. జీవితాన్ని ప్రజా సేవకే అంకితమిచ్చిన జైపాల్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్ర సీఎంగా కేసీఆర్ నేతృత్వంలోనే సంక్షేమ ఫలాలు అర్హులకు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తిర్మణీ నిర్మలాశ్రీశైలంగౌడ్, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాసుయాదవ్, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ నర్సింహ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు గోపాల్‌నాయక్, సర్పంచ్‌లు రఘుపతి, లక్ష్మణ్‌నాయక్, నరోత్తంరెడ్డి, వెంకటయ్య, బాలకుమార్‌గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శంకర్, శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విజయం ఖాయం



ప్రచారం చేస్తున్న ఆచారి

కడ్తాల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాగిస్తున్న మోసపూరిత పాలనకు ప్రజలు త్వరలోనే చరమగీతం పాడుతారని బీజేపీ సీనియర్ నాయకుడు తల్లోజు ఆచారి అన్నారు. మండల మండల పరిధిలోని బాలాజీనగర్, రేకులకుంటతండా, సాలార్‌పూర్, చల్లంపల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. తొమ్మిదేళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆచారి మాట్లాడుతూ.. రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రం అనేక పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాయ మాటలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తోందన్నారు. బీఆర్‌ఎస్ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారని స్పష్టంచేశారు. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమన్నారు. 35 సంవత్సరాలుగా ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాలతో అలుపెరగని పోరాటం సాగిస్తున్నానని తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో కల్వకుర్తిలో బీజేపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాన్యనాయక్, మాజీ జెడ్పీటీసీ కండె హరిప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి వీరయ్య, సర్పంచ్ సుగుణ సాయిలు, నాయకులు రాందాస్‌నాయక్, రెడ్యానాయక్, భగీరథ్, వెంకటేశ్, లక్ష్మణ్, సాయిప్రభు, రమేశ్, యాదగిరి కార్యకర్తలు, నాయకులున్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు



తాండూరు టౌన్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



దోమ: బతుకమ్మతో పీఎచ్‌సీ సిబ్బంది

దోమ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం బతుకమ్మ సంబురాలను అంగరంగవైభవంగా జరుపుకున్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి విద్య, ఏఎన్‌ఎంలు ప్రమీల, కాంతమ్మ, అంజమ్మతో పాటు ఆశ కార్యకర్తలు, ఆస్పత్రి సిబ్బంది బతుకమ్మ అందంగా పేర్చి ఉయ్యాల పాటలు పాడుతూ సందడిగా గడిపారు. ఈ కార్యక్రమలో ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్‌లో..

తాండూరు టౌన్: బతుకమ్మ సంబురాలు ఘనంగా కొనసాగుతున్నాయి. గురువారం పట్టణంలో పలు వాడల్లో రంగురంగు పూలతో బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు. మహిళలు ఉయ్యాల పాటలు పాడుతూ సందడి చేశారు. శాంతి నగర్‌లో నిర్వహించిన వేడుకలు ఆకట్టుకున్నాయి.